



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం

నేటి నుంచి 'పది' పరీక్షలు

• హాజరు కానున్న 32,787 మంది • 149 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో మొత్తం 32,787 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

జిల్లాలో 'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా అక్రమాలకు తావు లేకుండా పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలను జిల్లా అధికార యంత్రం తీసుకుంది. ఏ ఒక్క చిన్న పొరపాటు జరిగిన పరీక్షా కేంద్రాల్లోని సిబ్బందిపై వేటు తప్పదన్నట్లుగా పరీక్షలు నిర్వహించబోతున్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటించారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మూత్రశాలలు, ఫ్యాన్లు ఏర్పాటుతో పాటు ఏ విద్యార్థి కింద కూర్చొని పరీక్షా రాయడానికి వీలు లేకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్ సౌకర్యం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ పేర్కొన్నారు. అలాగే కాంపౌండ్ వాల్ లేని స్కూళ్లకు భారీకేడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న 490 పాఠశాలల నుండి 32,787 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు కోసం 149 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 3,598 మంది ప్రయివేట్ విద్యార్థులు, 29,162 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారు. 10 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వాటిలో సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

పరీక్షల నిర్వహణకు సిబ్బంది కేటాయింపు

పది పరీక్షల నిర్వహణకు సంబంధించి 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 149 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌లను, 1645 మంది ఇన్విజిలెటర్లను నియమించారు. 26 సిట్టింగ్ స్క్వాడ్‌లను, 07 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఇప్పటికే జిల్లాకు చేరాయి. ఈ ప్రశ్నాపత్రాలను జిల్లా అధికారులు సెట్ 1, సెట్ 2 ప్రశ్నపత్రాలను ఆయా రూట్ ఆఫీసర్ల ద్వారా 38 పోలీస్ స్టేషన్‌లలో భద్రపరిచారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సెంటర్ల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.



యుటిఎఫ్ రాష్ట్ర వర్గంలోకి జిల్లా నాయకులు

- రాష్ట్ర సహాధ్యక్షులుగా సురేష్ కుమార్

- రాష్ట్ర కార్యదర్శిగా నాగమణి ఎన్నిక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలోకి కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర సహాధ్యక్షులుగా కె.సురేష్ కుమార్ మరోసారి ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యదర్శిగా ఎం.నాగమణి మరోసారి ఎన్నికయ్యారు. సురేష్ కుమార్, నాగమణి ఎంపిక పట్ల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లప్ప, జయరాజు, సహాధ్యక్షులు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో యుటిఎఫ్ ఎనలేని పోరాటాలను చేసిందని పేర్కొన్నారు.

పొరపాట్లు లేకుండా 'పది' పరీక్షలు

• నేటి నుండి ఒంటి పూట బడులు • ప్రజాశక్తితో డిఇఒ వెంకట రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో టెన్త్ పరీక్ష లను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకట రంగారెడ్డి అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా దృష్టి సారించామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో సోమవారం నుండి ఒంటిపూట బడులను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు..



జిల్లాలో ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు పూర్తి చేశారు?

డిఇఒ : జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికి 31766 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు హాజరు కానున్నారు. అందులో ప్రభుత్వ పాఠశాలల ద్వారా 22791 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల ద్వారా 8975 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగింది. ఎక్కడ ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఇఒ : జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులతో టెన్త్ పరీక్ష ఫలితాలపై వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. పరీక్షా ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యచరణ ఇవ్వడం జరిగింది. పాఠశాలల్లో ఎవరైతే వెనుకబడినటువంటి విద్యార్థులు ఉంటారో వారిని గుర్తించి ప్రత్యేకంగా ఏ సబ్జెక్టులలో వెనకంజలో నిలిచి ఉంటారో ఆ సబ్జెక్టులో మరింత తర్ఫీదు సంబంధిత ఉపాధ్యాయుడు ద్వారా ఇప్పిస్తున్నాం. విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించడమే కాకుండా మోడల్ టెస్టులను కూడా నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో ఉత్తమ ఫలితాలు పొందేలా విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టింది.

జిల్లాలో గతేడాది టెన్త్ పరీక్షల్లో పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయి కదా ఇలాంటి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డిఇఒ : టెన్త్ పరీక్షల పేపర్ లీకేజీ పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. పేపర్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా పేపర్‌ని పరీక్షా కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత నడుమ చేర్చడం జరుగుతుంది. ఎవరైనా పేపర్ లీకేజ్‌కు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఇఒ : జగనన్న గోరుముద్దపథకం కింద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేసేలా చూస్తున్నాం. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఈ పథకం కింద ఆహారాన్ని అందిస్తున్నాం. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారం మెను కూడా మార్చడం జరిగింది. అందుకు అనుగుణంగానే మధ్యాహ్నం భోజన పథకంపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు, మా శాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ పథకంలో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరుదిద్దుతున్నాం.



వాల్మీకుల కుటుంబ సభ్యుడు జగన్

• వచ్చే ఎన్నికల్లో టిడిపిని భూస్థాపితం చేయాలి

• వాల్మీకుల కృతజ్ఞత సభలో మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే మాటను నిలబెట్టి అసెంబ్లీలో తీర్మానం చేశారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా వాల్మీకుల ఆధ్వర్యంలో వాల్మీకుల కృతజ్ఞత ర్యాలీని ఆదివారం కర్నూలు మేయర్ బివై.రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ మధుసూదన్ హాజరయ్యారు. ర్యాలీ జిల్లాపరిషత్ నుండి రాజ్ విహార్ కూడలి మీదుగా ధర్నా చౌక్ వరకూ సాగింది. అక్కడ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సభను ఉద్దేశించి మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రాష్టంలో నాలుగు లక్షల జనాభా కలిగిన వాల్మీకి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడంపై ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టిన ముఖ్యమంత్రికి వాల్మీకుల శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన 4 ఏళ్లలోనే వాల్మీకులకు 105 పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ కుటుంబానికి మాత్రమే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేలా చివరి రక్తం బొట్టు దాకా శ్రమించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు పార్టీని భూస్థాపితం చేసేదాకా వాల్మీకులు పోరాడి యుద్ధం చేయాన్నారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ వాల్మీకి కుటుంబ సభ్యుడు జగన్ అని కొనియాడారు. వాల్మీకులంటే అక్కును చేర్చుకున్న ఒకే ఒక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ఫలితం ఢిల్లీ నుండి తీపి కబురు వచ్చేదాకా శ్రమిస్తారన్నారు. జగన్మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించే దాకా వాల్మీకులు నిలబడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా తీర్మానం చేశారన్నారు. జగన్‌ను వాల్మీకులు గుండెల్లో పెట్టుకుంటారని, రాబోయే రోజుల్లో వాల్మీకుల బలం చూపిస్తామని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిల్ పాస్ అయ్యేదాక ముఖ్యమంత్రికి సైన్యంలా ఉంటామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘాల నాయకులు, ప్రతినిధులు, వివిధ మండల, గ్రామాల వాల్మీకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు

- వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని వామపక్ష నాయకులు ప్రజలను కోరారు. ఆదివారం కర్నూలు నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్షాల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు బి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడారు. దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 30 వరకు జిల్లాలో పాదయాత్రలు చేపడతామని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఆర్థిక విధానాలపై, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, జిఎస్‌టి, అధిక ధరల ద్వారా ప్రజలపై పడుతున్న భారాల గురించి ప్రజలకు వివరిస్తామని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద వైఖరి, పౌరసత్వం, ఢిల్లీలో దాడులు, మతమార్పిడులు, మైనార్టీలపై, దళితులపై దాడులు చేస్తోందని విమర్శించారు. బిజెపి అవినీతి, కుంభకోణాలు, రాఫెల్ కుంభకోణం, అదాని కుంభకోణం, న్యాయవ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నం చేయడం వంటి వాటిని వివరిస్తామని చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేసే పద్ధతులను బిజెపి అనుసరిస్తోందని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ, పోలవరాన్ని నిర్లక్ష్యం చేయడం, కడప ఉక్కు ఊసే ఎత్తకపోవడం, రాజధాని నిర్మాణంపై రెండు నాలుకల ధోరణి అనుసరించడం లాంటి బిజెపి విధానాలను ప్రజల్లోకి పాదయాత్రల ద్వారా తీసుకెళ్తామని తెలిపారు. అలాగే పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి, చెత్త పన్ను, విద్యుత్ చార్జీలు పెంచే అంశాలను కూడా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఏకం కావాలని కోరారు. బిజెపికి వంత పాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ చేపడుతున్న పాదయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో సభలు, పాదయాత్రలు నిర్వహిస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్, జిల్లా నాయకులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

12న హైవే దిగ్బంధనం : శకునాల గ్రామస్తులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : ఓర్వకల్లు మండలం శకునాల గ్రామం శ్రీ కాశీ రామేశ్వర స్వామి ఆలయ భూములు 18 ఎకరాల్లో అక్రమంగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీ హైవే దిగ్బంధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శకునాల గ్రామస్థులు చంద్రబాబు నాయుడు, చాంద్ బాషా, శివారెడ్డి, శివుడు, మల్లమ్మ, రమాదేవిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి నాగన్న, సిఐటియు నాయకులు శ్రీధర్, సుధాకర్, షాజహాన్, రైతు సంఘం నాయకులు మధుసూదన్, ప్రజాసంఘాల కార్యకర్తలు రాజకీయ పార్టీలకు అతీతంగా పాల్గొంటారని తెలిపారు. కావున గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

గీతాంజలి నర్సింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ డే

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

కర్నూలు నగరంలోని గీతాంజలి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నర్సింగ్ కోర్సును ముగించుకొన్న 2018-2022 బ్యాచ్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా ఫేర్వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల అధినేత పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ వై.సూర్యచంద్రరెడ్డి, టిడిడి ధర్మప్రచార పరిషత్తు కమిటీ సభ్యులు, గీతాంజలి, కళాంజలి నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి పవిత్రమైనదని అన్నారు. డాక్టర్ వై.సూర్యచంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యాలయాలు సరస్వతి దేవాలయాలని, అందులో చేరిన ప్రతి ఒక్క విద్యార్థి సమాజానికి మంచి సేవకుడుగా రాణిస్తారని అన్నారు. గీతాంజలి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి విద్యార్థి సేవలో అంకిత భావంతో ప్రవర్తించి మంచి పేరును గడించాలని సూచించారు. కిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అర్చన మాట్లాడుతూ కోర్సు ముగించుకొన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ఉపాధ్యాయ బృందం వై.శిరీష, టి.శిరీష, సౌజన్య, సురేఖ, నిర్మల, జ్యోతి తేజస్వినిలు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ మాజీ అధ్యక్షులు ఎ.సయీద్ సహబ్ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు అష్ఫాక్ హుస్సేన్ మాట్లాడుతూ ఎ.సయీద్ సహబ్ ఎస్‌డిపిఐ పార్టీ కోసం చేసిన త్యాగాలు, కృషి మరవలేనిదని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ షేక్షావలి, కౌన్సిల్ నాయకులు జలీల్, సలాం, షఫీ అహ్మద్, అబ్దుల్లా, రషీద్, నాయకులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అక్రిడిటేషన్ కమిటీల్లో

ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలి

- మంత్రి గుమ్మనూరుకు వినతి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లను జారీ చేసే కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రజాప్రతినిధులకు వినతిని అందించాలని పిలుపులో భాగంగా ఆదివారం వాల్మీకి మహా సభకు హాజరయిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, సహాయ కార్యదర్శి శ్రీరాములు, జిల్లా నాయకులు చంద్ర మోహన్, రాజశేఖర్ నాయుడు, ఉపాధ్యక్షులు విద్యాసాగర్, రమేష్, ఫొటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన నాటి నుంచి ఏర్పాటైన అక్రిడిటేషన్ కమిటీలలో ఎపిడబ్ల్యూజెఎఫ్‌కు ప్రాతినిధ్యం ఉన్నదని, అతిపెద్ద సంఘంగా రాష్ట్రంలో వేలమంది జర్నలిస్ట్ సభ్యులతో జిల్లా, నియోజకవర్గ కమిటీలతో ఫెడరేషన్ పని చేస్తుందన్నారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసే కమిటీలకు సంబంధించి మార్చి 31న రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేసిందని, ఆ అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘ ప్రాధాన్యం ఉండడం తప్పనిసరి అని భావిస్తున్నమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్‌కు ప్రాతి నిధ్యం కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చర్చిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నగర నాయకులు శ్రీరామ్, మధు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్రీడల్లోనూ రాణించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అప్పుడే భవిష్యత్తు ఉంటుందని నాలుగో పట్టణ ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి, నారాయణ విద్యా సంస్థల ఎజిఎం రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎల్కూరు బంగ్లా వద్ద ఉన్న నారాయణ పాఠశాలలో ఈ చాంప్స్ వార్షిక క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారు పేరుగా క్రీడాకారులు నిలుస్తారని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడి చదువుల్లో మంచిగా రాణించేందుకు దోహద పడతాయన్నారు. ఎజిఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థుల సౌలభ్యం కోసం 50 లక్షల విలువ చేసే ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అతిథులకు గౌరవ వందనాలను సమర్పించారు. కార్యక్రమంలో అర్ఐలు దుర్గా లక్ష్మి, అన్వర్ భాష, కొండలరావు, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ రెహనా, పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

కర్నూల్ నగరంలోని మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో సిలంబం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలంబం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ బాల బాలికలకు ఆత్మరక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం క్రీడాకారులకు పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సిలంబం శిక్షకుడు బి.రాఘవేంద్ర మాట్లాడుతూ ఏ పాఠశాల విద్యార్థులైనా, ఇతర ప్రాంతాలు వారైనా శిక్షణ పొందవచ్చని చెప్పారు. ఉదయం 6 నుండి 8 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సిలంబం కార్యదర్శి బి మహావీర్ ఠాగూర్, సాయినాథ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

డిఎస్‌సి, గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : తక్షణమే డిఎస్‌సి, గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ తక్షణమే 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలకు మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, డిఇఒ కార్యాలయాల ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, డిఎస్‌సి అభ్యర్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 5600 గ్రూప్ 2 ఉద్యోగాలకు, ట్రాన్స్కోలో ఏఈ ఉద్యోగాలకు కూడా తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా సహాయ కార్యదర్శులు మైన, హుసేన్ బాషా, జిల్లా నాయకులు ప్రకాష్, గోవర్ధన్, రంగప్ప, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

పెట్టుబడులను ఆకర్షించడంలో వైసిపి విఫలం

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వమే సొంతంగా సంపద సృష్టించే ప్రాజెక్టులలో ఇన్వెస్ట్ చేయడం, లేదా ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టులు ఎగ్జిక్యూట్ చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు విమర్శించారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రయివేట్ సెక్టారుకు ఢోకా లేదన్న భరోసా కల్పించడం ద్వారా టిడిపి హయాంలో ఎందరో పెట్టుబడుదారులు ముందుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం అరాచక నైజం, అధికార పార్టీ నాయకుల దౌర్జన్య ఘటనలు చూసి పారిశ్రామిక వేత్తలు ముందుకు రాని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న రోడ్ల నిర్మాణ, నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులను వెచ్చించడం నిలిపివేసిందన్నారు. జాబ్ క్యాలెండర్‌లో 2.30 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థతను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. వైసిపిలో గుర్తింపు లేక సీనియర్లు మదన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కక్ష సాధింపు చర్యలు మానుకొని అభివృద్ధి వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. లోకేష్ 'యువ గళం పాదయాత్ర'కు వస్తున్న స్పందన చూసి ఓర్వలేక కామెంట్లు చేస్తున్నారని, తిప్పికొట్టాలని తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, సీనియర్ నాయకులు రంగన్న, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, శివప్ప, బసవరాజు, శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ, జై రామ్, అల్తాఫ్, మాబాష, సజ్జాత్, అంజి, రామకృష్ణ, మల్లికార్జున, సుబ్బారెడ్డి, అయ్యన్న పాల్గొన్నారు.

బీసీలకే మంత్రాలయం టిడిపి టికెట్

- టిడిపి బీసీ శ్రేణుల ఆశాభావం

- పార్టీ అధిష్టానం కూడా బీసీల వైపే మొగ్గు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే టికెట్ బీసీలకే వస్తుందని టిడిపి బీసీ శ్రేణులు టిడిపి కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ముత్తరెడ్డి, కౌతాళం మండల కన్వీనర్ సి.ఉల్లిగయ్య, పల్లెపాడు రామిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం టిడిపి పట్టణ అధ్యక్షులు చింతలగేని నరసరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలకు ఆత్మీయ భోజన కార్యక్రమం చేపట్టారు. సుమారు 300 మంది టిడిపి బీసీ శ్రేణులు హాజరయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో మూడు స్థానాలకు మూడు స్థానాలు టిడిపి విజయఢంకా మోగించిందని తెలిపారు. రాష్ట్రంలో వైసిపికి కోలుకోలేని దెబ్బ కొట్టిందని చెప్పారు. వైసిపి నాయకులు ఓటుకు రూ.1000 నుంచి రూ.2000 పంచినా టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ వైసిపి ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తోందని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి బీసీలకు టిడిపి టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని పలుమార్లు కోరామని తలెఉతెలిపారు. అధిష్టానం కూడా బీసీల వైపు మొగ్గు చూపుతోందన్నారు. నియోజకవర్గంలో బీసీలు అత్యధికంగా ఉన్నారని, ఈసారి మంత్రాలయం టిడిపి టికెట్ బీసీలకు ఇస్తే జెండా ఎగరవేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు తుమ్మిగనూరు రాజు, పులుసు శివన్న, బుల్లి నర్సప్ప, గోవిందు, నరసన్న, సొట్టయ్య, కృష్ణ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి బీసీ శ్రేణులు

భానుడి భగభగ...

- మే, జూన్‌లో అధిక ఉష్ణోగ్రతలు
- వాతావరణ శాఖ హెచ్చరికలు
- బయటికి వెళ్లడానికి భయపడుతున్న ప్రజలు

భానుడు భగభగమంటూ నిప్పులు కక్కుతున్నాడు. ఎండలు దంచి కొడుతుండడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. బయటికి వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడి ప్రతాప మొదలవుతోంది. గత మూడేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది ఎండలు పెరిగిపోవడంతో మే, జూన్‌లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది.

ప్రజాశక్తి - హోళగుంద

పగలూ, రాత్రి అని తేడా లేకుండా ఇంట్లో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రేపటి నుంచి మరింత ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్థికంగా బలపడిన కుటుంబాలు ఎండ తాకిడిని తట్టుకోలేక ఇంటి దగ్గర ఉన్నా గడిచిపోతుంది. రైతులు, చిన్న పరిశ్రమల కార్మికులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. చిన్న పరిశ్రమల యాజమాన్యం, ఉపాధి హామీ అధికారులు ఎండ వేడి నుంచి కార్మికులు, కూలీలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

తాగునీరు, నీడ అవసరం

వేసవికాలం మొదలైందంటే ప్రతి ఒక్కరికీ తాగునీరు, ఎండ వేడిని తట్టుకోవడానికి నీడ అవసరం. ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించే ప్రదేశంలో కచ్చితంగా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, తాగుటిని అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు. ప్రయివేట్, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఆయా శాఖల యాజమాన్యంపై ఉంది.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

గ్రామీణ, మండల, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా జనసంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఆయా శాఖల అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చేవారు. ఈ ఏడాది కూడా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, అధికారులు అక్కడక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేసినా, ఇంకా అధిక జన సంచారం ఉండే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుదాం

- మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మాలల సత్తా చాటుదామని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య తెలిపారు. ఆదివారం దైవందిన్నె గ్రామ మాలల ఆహ్వానం మేరకు శ్రీరాముల నవమి జాతర సందర్భంగా గ్రామానికి సతీ సమేతంగా వచ్చారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దళితులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంగీత వాయిద్యాలు, డప్పు వాయిద్యాల నడుమ, బాణసంచాలతో ఊరేగింపుగా శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లారు. అక్కడ వారికి స్వామి వారి దర్శనం చేయించారు. అనంతరం ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రంగయ్య మాట్లాడారు. దళితులపై మునుపెన్నడూ లేనివిధంగా జరుగుతున్న దాడుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్వీయ రక్షణ తర్ఫీదు, గుంపు కదలికలు, స్వీయ రక్షణ దళం ఏర్పాటు, తక్షణ ప్రతిఘటన, అందుబాటులో ఉన్న సాంకేతిక వినియోగంలాంటి కొన్ని విషయాలను వివరించారు. దళితులను పట్టించుకోని రాజకీయ పార్టీలను తుదముట్టించి మన బలమేంటో నిరూపించుకుందామని తెలిపారు. ఎవరూ ఓటును అమ్ముకోవద్దని సూచించారు. దళితులు ఎంత శాతం ఉన్నారో అంతశాతం రాజ్యాధికారంలో ఉండేలా పోరాటం చేద్దామని చెప్పారు. ఏళ్ల తరబడి అణిచివేతకు గురైంది చాలని, తిరుబాటు మొదలుపెడదామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని పల్లెలకు వెళ్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులను, ప్రజలను కలిసి ఐక్యతను చాటుతానని చెప్పారు. రాబోయేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దళితుల రాజ్యమేనని తెలిపారు. అనంతరం విందులో పాల్గొన్నారు. జిల్లా నాయకులు రామలింగప్ప, మల్లేష్, పెద్దలు జంబన్న, పెటయ్య, మునిస్వామి, నాగేష్, దస్తగిరి, మునెప్ప, ఉరుకుందు, తాలూకా నాయకులు పెద్దయ్య, శాంతి కుమార్, వెంకటేష్, సూరి, మల్లేష్, నాని, నరసింహా, బలరాం, తరుణ్, నరసింహా, రాము, నరేంద్ర పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న రంగయ్య



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా ధరణీ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుమారుడు, వైసిపి యువనేత వై.ధరణీ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు.



కౌతాళంలో...

కౌతాళంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుమారుడు వై.ధరణీరెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. దేశాయి ప్రహ్లాదచారి ఆధ్వర్యంలో సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచి తిక్కయ్య, మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు, వైసిపి కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలను పంచారు. అనంతరం శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటరామరాజు, అబ్దుల్ సమ్మద్, వెంకోబా, ఉమాపతి, వీరేష్, బాష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్ శర్మ

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు చేరాలి

- జెసిఎస్-2 ఇన్‌ఛార్జీ మధుసూదన్ శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదోని జెసిఎస్-2 ఇన్‌ఛార్జీ వెల్లాల మధుసూదన్ శర్మ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 7 నుంచి 14 వరకు జరగనున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంపై దిశానిర్దేశం చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అనేక సంక్షేమ పథకాల అమలుకు, సంక్షేమ అభివృద్ధికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. సచివాలయ కన్వీనర్లకు కేటాయించిన 'మా నమ్మకం నువ్వే జగనన్న' కిట్లలో భాగంగా జేబుకు బ్యాడ్జి తగలించుకుని ప్రతి గడపకూ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకం ద్వారా 5 అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టాలని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

టిడిపితోనే బ్రాహ్మణుల అభివృద్ధి

- మాజీ డిఎల్ఓ గురు రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బ్రాహ్మణుల అభివృద్ధి ఒక్క టిడిపితోనే సాధ్యమని కర్నూలు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డిఎల్ఓ కరణం గురు రాఘవేంద్రరావు తెలిపారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్, క్రెడిట్ సొసైటీ ద్వారా రూ.385 కోట్లు బ్రాహ్మణుల సంక్షేమానికి ఖర్చు చేసింది గత టిడిపి ప్రభుత్వమేనని తెలిపారు. యువగళం యాత్రలో భాగంగా పెనుగొండలో నారా లోకేష్ బ్రాహ్మణులను పట్టించుకోలేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 67 ఏళ్ల తర్వాత స్వతంత్ర భారతంలో మొట్టమొదటిసారి బ్రాహ్మణ కార్పొరేషన్ ఇచ్చింది టిడిపి అని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బ్రాహ్మణుల సంక్షేమమన్నా, ఆనందంగా ఉన్నారన్నా, పథకాలు వచ్చాయన్నా అవి ఒక్క టిడిపి ప్రభుత్వంలోనే అని తెలిపారు. ఏదో రకంగా టిడిపిపై బురద చల్లాలన్న ప్రయత్నాలను కొంత మంది మానుకోవాలని హితవు పలికారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై

దశలవారీ ఆందోళనలు

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక, నిరంకుశ పాలనపై దశలవారీ ఆందోళనలు చేపడతామని సిపిఎం పట్టణ నాయకులు రాముడు, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు. ఆదివారం సిపిఎం, సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 14 నుంచి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల, ప్రజావ్యతిరేక నిరంకుశ పాలనపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఉమ్మడి క్యాంపెయిన్ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరిస్తూ ఈనెల 14 నుంచి 30 వరకు పట్టణంలోని 34 వార్డుల్లో ప్రచార నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించే ప్రయత్నాలు అడ్డుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కేంద్ర విధానాలకు మద్దతునిస్తోందని విమర్శించారు. విద్యావిదానం, పట్టణ సంస్కరణలు, ఉపాధి హామీ చట్టంలో కోతలు, నిబంధనలు మార్చడంపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం విడ్డురంగా ఉందన్నారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, సమీవుల్లా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్తన్న, సిపిఐ సీనియర్ నాయకులు దాదావలీ, నరసింహులు, విజయ్, సిపిఎం నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం పట్టణ నాయకులు రాముడు

IN THE COURT OF THE 2ND ADDL. DIST. JUDGE: KURNOOL AT ADONI
A.S.No. 30/2022

Between:
Sulam Haribabu. ...Appellant
v/s
1.M.Veeresh
2. V.P.Rama Rao. ...Respondents

NOTICE TO RESPONDENT No. 2

V.P.Ramarao S/o V.P.Raju, H.No.21/143, S.K.D. Colony, O Road, Adoni, Kurnool Dist.

Take notice that the above A.S.NO.30/2022 Posted to 27-04-2023 for your appearance you are hereby informed to appear before the above said court in person or through advocate failing which you will be set ex party and the A.S. will be decided in your absence.

(By order of the court)
B.NETTEKANTAIAH,
ADVOCATE, ADONI.
CELL: 9440342305

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నేమకల్లు గ్రామంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రోజూ గ్రామంలోకి వదిలే నల్లంబావి నీళ్లలో విద్యుత్ మోటార్‌కు ఇచ్చిన విద్యుత్ తీగలను కత్తిరించి విద్యుత్ కనెక్షన్ ఉన్న సగం తీగలను బావిలోకి వేసి పోయారని పంచాయతీ అధికారులు ఆదివారం తెలిపారు. పంచాయతీ కార్మికులు చూసుకోకపోతే పెద్ద ప్రమాదం సంభవించేదని, వెంటనే చూసుకోవడం వల్ల ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. ఇలా విద్యుత్ తీగలను కత్తిరించడం రెండోసారి అని, ఇలా జరగకుండా దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా పోలీసులకు విన్నవిస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని సిఎస్ఐ క్రైస్ట్ చర్చిలో 'మట్టల ఆదివారం'ను ఘనంగా నిర్వహించారు. ఉదయం సిఎస్ఐ క్రైస్ట్ చర్చిలో సంఘం ఆధ్వర్యంలో మట్టలు చేత పట్టుకుని చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేసి చర్చిలోకి ప్రవేశించారు. చర్చి పాస్టర్ ఐజాక్ సంజయ్, సెక్రటరీ సునీల్ రాజ్ కుమార్, శ్రీకాంత్, జొనాథన్, ప్రసాద్, సునీత రాజ్, సౌజన్య, గాయత్రి, చిన్నారులు సొనల్, సుహైలా, గగన చైత్ర, తేజస్, జోయల్, ఏంజిల్ పాల్గొన్నారు. అలాగే ఎస్‌కెడి కాలనీలోని సిఎస్ఐ ఒట్రిటీ చర్చిలో రెవరెండ్ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో ఈత మట్టలు చేత పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. గుడ్ ఫ్రైడేకు ముందు క్రీస్తును స్మరించుకుంటూ మట్టల ప్రదర్శన నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సంఘం పెద్దలు విల్సన్ బాబు, డేవిడ్ ఉన్నారు.

చలో వాల్మీకి సభకు నాయకులు

ఆదోనిరూరల్ : కర్నూలు నగరంలో ఆదివారం జరిగే వాల్మీకి బహిరంగ సభకు ఆదోని నుంచి దాదాపు 1000 మంది వాల్మీకి నాయకులు తరలి వెళ్లారు. అంతకుముందు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. ప్రాంతీయ వ్యత్యాసాన్ని తొలగించేందుకు మార్చి 24న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టి కేంద్రానికి పంపారన్నారు. 2024లో మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేస్తామన్నారు. కిషోర్, రామకృష్ణ, బ్రహ్మ, గిడ్డయ్య, సోము, భరత్, కేశవ, రమేష్, వెంకటేష్, దుర్గప్ప, సురేష్, రామాంజనేయులు, గాది లింగ, మధు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగులను జగన్ సర్కార్ నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని దైవందిన్నె గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అనేది లేకుండా చేస్తానని2019 ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతేడాది జనవరి నెలను జాబ్ క్యాలెండర్ నెలగా ప్రకటిస్తామని హామీఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. ప్రతేడాది డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. ఇటీవల కాలంలో విశాఖపట్నంలో ముగిసిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 'ఫేక్' పెట్టుబడులతో మోసం చేశారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్‌లో కూడా అదే విధానాన్ని అవలంభించి అంకెల గారడీతో ప్రజలను, నిరుద్యోగులను తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలను ప్రభుత్వమే స్వంతంగా సంపద సృష్టించి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా, ప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టులు ఎగ్జిక్యూట్ చేయడం ద్వారా, రాష్ట్రంలో ప్రయివేట్ సెక్టారుకు ఢోకా లేదన్న భరోసా కల్పించాలని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఈ విధానాల్లో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఒకప్పుడు విదేశీ పెట్టుబడిదారులు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండేదని తెలిపారు. ఇప్పుడు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే 14వ స్థానానికి పడిపోయిందని చెప్పారు. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ ధోరణి మారలేదని తెలిపారు. ఉద్యోగాల కల్పన ఊసేలేదు, ఆ దిశగా ఎలాంటి చర్యలూ కనిపించడం లేదన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఏటా మరో 6.5 లక్షల మందికి నష్టం వాటిల్లుతుందని మండిపడ్డారు. రాబోవు రోజుల్లో వైసిపి ప్రభుత్వానికి నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలో ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఓటు బ్యాంకుగా వాడుకోవడం తగదు

- స్వకుళ సాళి సమాజ్ రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

స్వకుళ సాళీలను ఓటు బ్యాంకుగా రాజకీయ పార్టీలు చూడడం తగదని, తగిన గుర్తింపు ఇవ్వకపోతే తమ సత్తా చాటుతామని స్వకుళ సాళి సమాజ్ రాష్ట్ర నాయకులు కమలే నాగేష్ హెచ్చరించారు. త్వరలో జరిగే అఖిలభారత సమావేశానికి నాంది పలుకుతూ ఆదివారం స్థానిక శ్రీఅంబా భవాని దేవాలయం కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని ప్రాంతంలో అత్యధిక జనాభా కలిగిన సమాజం తమదని తెలిపారు. ఎన్నికల్లో ఏ పార్టీ రాజకీయంగా గెలవాలన్నా నిర్ణయాత్మక ఓటర్లుగా ఉన్నామన్నారు. రాజకీయంగా అండదండలు లేనిదే ఎవరూ గద్దనెక్కలేరని తెలిపారు. కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని జెండా మోసే కార్యకర్తలుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయంగా ఉన్నత పదవులు కేటాయించి, రాజకీయ గుర్తింపునకు ప్రతి పార్టీ ముందుండి నడపాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో తకు ఏ పార్టీ ఉన్నత పదవులు కేటాయిస్తూ మేనిఫెస్టోలో పొందుపరిచి పూర్తిస్థాయిలో హామీ ఇస్తూ, ప్రకటిస్తారో వారికి మద్దతు తెలియజేస్తామని అన్నారు. అనంతరం సమాజ్ అధ్యక్షులు, సెక్రటరీ జిందే లక్ష్మణ్ మాట్లాడారు. త్వరలో అఖిల భారత సమావేశాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి రాష్ట్రంలో రాజకీయంగా ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి రాజకీయ గుర్తింపు తెచ్చుటకు కృషి చేయాలని కోరారు. సమాజ్ మహిళా రాష్ట్ర అధ్యక్షులు లోకేశ్వరి మాట్లాడుతూ... తమ సమాజం ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రతి పార్టీ ఆదోని ప్రాంతంలో ఉన్నత పదవులు కేటాయించాలని కోరారు. గణేష్, నాగరాజు, అధ్యక్షులు మల్లికార్జున్, మలేకర్ శ్రీనివాసులు, సఫారీ రామకృష్ణ, సర్వదే విఠల్, సాక్రి గోపి, జిందే గోవిందరావు, సాక్రి మల్లికార్జున, సాక్రి శ్రీనివాసులు, జె.విశ్వనాథ్, మహాదేవ్, శంకర్, అయ్యప్ప, సాయి, శ్రీనివాసులు, శీను, జిందే ఈరన్న, ఆనంద్, ఈరన్న రావు, ఝాన్సీ, లక్ష్మి, పార్వతి, నాగవేణి, రాజేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నేడు చికెన్, మటన్ విక్రయాలు బంద్

- కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మహావీర జయంతి సందర్భంగా సోమవారం చికెన్, మటన్ విక్రయాలకు అనుమతి లేదని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఆదివారం తెలిపారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం జంతు వధశాలలను మూసి వేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని చికెన్, మటన్ షాపుల యజమానులు గమనించి కమేళాలు, షాపులను మూసివేయాలన్నారు. ఆదేశాలను బేఖాతరు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- ఎంఇఒ మస్తాన్ రావు

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరిలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఎంఇఒ మస్తాన్ రావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో పరీక్షల నిర్వహణ కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. చిప్పగిరి మండలంలో మొత్తం ఐదు ప్రభుత్వ పాఠశాలలు, ఒక ప్రయివేట్ పాఠశాల ఉందని తెలిపారు. ఈ పాఠశాలలకు సంబంధించి మొత్తం 308 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు తప్పకుండా హాల్ టికెట్లు తీసుకుని, సరైన సమయానికి హాజరుకావాలని సూచించారు. ఎండలు అధికంగా ఉండడంతో విద్యార్థులు తగిన జాగ్రత్తలతో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.

గోనెగండ్ల : పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాలకు అవసరమైన బెంచీలను, ఇన్విజిలేటర్లు, చీఫ్ ఎగ్జామినర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గదిలోనూ నెంబర్లను వేసి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఇఒ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 450 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 4 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు రాసే విద్యార్థులు నిర్దేశించిన సమయం కంటే ముందుగానే 9 గంటల్లోపు కేంద్రాలకు చేరుకొని పరీక్షలను ప్రశాంతంగా రాయాలని సూచించారు.

నేడు ఆదోనిలో 'స్పందన'

ప్రజాశక్తి - ఆదోని

సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అభిషేకర్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి వినతుల స్వీకరణ జరుగుతుందన్నారు. డివిజన్ కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE ALUR
I.A. NO: 271/2020 in O.S. NO: 19/2019

Between:-
K. Subba Reddy and three others.
...Petitioners/Plaintiffs
V/S
M. Siddanna died by LR's and others,
... Respondents/Defendants

Summons / Notice to the Proposed Respondents / Defendants No. 5 to 7

1). Smt. M. Obulamma, W/o M. Basappa, (R/D 5), D/o Late M. Siddanna, Age 55 years.
R/o Chagi Village, Adoni Mandal, Kurnool District.
2). Smt. M. Sharadamma, W/o Jayramudu. (R/D 6), D/o Late M. Siddanna, Age 52 years.
R/o Near Elementary School. Karvenpet, Adoni Town, Kurnool District.
3). Smt.M.Suseelamma, W/o Venkatesh. (R/D 7), D/o Late M. Siddanna, Age 50 years,
R/o Ramajala Road, Adoni Town, Kurnool District.

Whereas the above named Petitioners/Plaintiffs filed a suit against the defendants 1 to 4 for permanent injunction. During pendency of the said suit before the above court, the Defendant No.1 by name M.Siddanna died on 30-06-2020, you are the legal heirs of said M.Siddanna. The L.R's Petition filed and the same was posted for yours appearance on dt.11-04-2023. You the Proposed Respondents/ Defendants No.5 to 7 are hereby directed to appear in person or through your Counsel on 11-04-2023 at 10.30 A.M before the above said Court and answer the said L.R's Petition. Failing which the matter will be decided in your absence.

BY COURT ORDER
Sri. B.Lakshmi Kanth,
Sri. R.S Vali,
Advocates for the Plaintiffs

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE ALUR
I.A. NO: 269/2020 in
I.A. No: 52/2019 in O.S. NO: 19/2019

Between:-
K. Subba Reddy and three others
... Petitioners/Plaintiffs
V/S
M. Siddanna died by LR's and others,
... Respondents/Defendants

Summons / Notice to the Proposed Respondents/Defendants No. 5 to 7

1. Smt. M. Obulamma, W/o M. Basappa. (R/D 5). D/o Late M. Siddanna, Age 55 years, R/o Chagi Village, Adoni Mandal, Kurnool District.
2. Smt. M. Sharadamma, W/o Jayramudu. (R/D 6), D/o Late M. Siddanna, Age 52 years, R/o Near Elementary School. Karvenpet, Adoni Town, Kurnool District.
3. Smt.M.Suseelamma, W/o Venkatesh, (R/D 7). D/o Late M. Siddanna, Age 50 years, R/o Ramajala Road, Adoni Town, Kurnool District.

Whereas the above named Petitioners / Plaintiffs filed a petition against the Respondents/Defendants 1 to 4 for interim injunction. During pendency of the said suit before the above court, the Defendant No. 1 by name M.Siddanna died on 30-06-2020, you are the legal heirs of said M Siddanna. The L.R's Petition filed and the same was posted for yours appearance on dt.11-04-2023. You the Proposed Respondents/Defendants No.5 to 7 are hereby directed to appear in person or through your Counsel on **11-04-2023 at 10.30 AM** before the above said Court and answer the said L.R's Petition. Failing which, the matter will be decided in your absence.

BY COURT ORDER
Sri. B.Lakshmi Kanth,
Sri. R.S Vali,
Advocates for the Plaintiffs